ఇలాంటి రోడ్లపై ప్రయాణం చేసేదెలా..?!

- రహదారులు అద్దాల్లా తీర్చిదిద్దుతామని ఎన్నికల హామీ
- గెలిచాక హామీలు నెరవేర్చలేమని చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ
- ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లను పట్టించుకోని వైనం



గోతులమయంగా ఉన్న బాలాజీనగర్‌తండా రోడ్డు



నకరికల్లు నుంచి సత్తెనపల్లి వచ్చే రోడ్డు

నకరికల్లు: హైవేలపై వేగం కారణంగా ప్రమాదాలు.. గ్రామీణ రోడ్లలో గోతుల కారణంగా ప్రమాదాలు.. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం.. ప్రయాణమంటే ప్రమాదమయం అన్న చందంగా ఉంది కూటమి ప్రభుత్వంలోని రోడ్ల పరిస్థితి. ఎన్నికలకు ముందు ప్రచారంలో రోడ్లన్నీ అద్దాల్లా.. తీర్చిదిద్దుదాం.. అంటూ కూటమి తరఫున హామీలు గుప్పించి తీరా అధికారం చేజిక్కించుకున్నాక చేతులెత్తేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో చూపుతూ మసిపూసిన మారేడు అన్నట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నారు. పల్లె పండుగ పేరుతో రోడ్లకు మరమ్మతులు చేస్తాం.. కొత్త రోడ్లు వేస్తాం అంటూ పల్లెల్లో సంబరాలు అంటూ ఆర్భాటం చేశారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు మినహాయించి రాష్ట్ర ప్రభుత్వ నిధులు కనీసం ఒక్క పైసా అయినా ఖర్చుపెట్టి ఆర్ అండ్ బీ రోడ్లు గానీ, పంచాయతీరాజ్ రోడ్లు గానీ వేసిన దాఖలాలు లేవు. దీంతో కూటమి అధికారంలోకి వచ్చింది రోడ్లు బాగుపడతాయని ఆశపడ్డ ఆ పార్టీల వారికి సైతం భంగపాటే మిగిలింది.

హామీలు నెరవేర్చలేమని చేతులెత్తేశారు

అధికారంలోకి వచ్చాక రోడ్లన్నీ బాగుచేస్తామని ఇచ్చిన హామీలన్నింటినీ సూపర్‌సిక్స్‌తో సహా గాలికొదిలేసి చేయలేమని చేతులెత్తేశారు. కొత్తగా రోడ్డు నిర్మాణం కాదు గదా కనీసం మరమ్మతులు కూడా కూటమి ప్రభుత్వం చేపట్టలేదు. గ్రామాలను కలిపే రోడ్లపై ఉన్న గోతుల్లో అక్కడక్కడా మట్టిపోసి మరమ్మతులు చేశామని మాయమాటలు వల్లె వేస్తున్నారు. కుంకలగుంట గ్రామం నుంచి చేజర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు, నకరికల్లు నుంచి శివాపురం తండా మీదుగా ఉదయ్‌నగర్ కాలనీకి వెళ్లే రోడ్డు, నర్సింగపాడు, గుండ్లపల్లి గ్రామాల మధ్య గల నకరికల్లు–మాచర్ల రోడ్డు, నర్సింగపాడు నుంచి బాలాజీనగర్ తండాకు వెళ్లే రోడ్డు, చల్లగుండ్ల, దేచవరం గ్రామాలను కలిపే రోడ్డు, దేచవరం గ్రామం నుంచి కుంట వరకు గల రోడ్డు, కండ్లకుంట, చాగల్లు గ్రామాలకు రాకపోకలు సాగించే రోడ్డు.. ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామాలను కలిపే రోడ్లన్నీ గోతులమయంగానే దర్శనమిస్తున్నాయి.



నకరికల్లు నుంచి శివాపురంతండా రోడ్డు

మొదలైన పనులకు కొనసాగింపు లేదు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం నుంచి నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు మండలాలను కలిపే విధంగా డబుల్‌రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో జలవనరుల శాఖ మంత్రిగా ఉన్న అంబటి రాంబాబు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల నుంచి నకరికల్లు మండలం చేజర్ల గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రోడ్డు పనులను ఆపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదృష్టం కొద్దీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కనీసం నిర్మాణ దశలో ఉన్న రోడ్డు పనులను కొనసాగించే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో కూటమి ప్రభుత్వానికి రోడ్ల నిర్మాణ హామీ నిలబెట్టుకోవడంలో ఎంతటి చిత్తశుద్ధి ఉందో తేటతెల్లమవుతుంది. ప్రకటనలు, ఆర్భాటాల మీద ఉన్న శ్రద్ధ రోడ్లకు మరమ్మతులు చేయడంలో, హామీలు నిలబెట్టుకోవడంలో లేదని ప్రజలు మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా...

వైఎస్సార్‌సీపీ హయాంలో నకరికల్లు నుంచి ఇనిమెట్ల మీదుగా సత్తెనపల్లి వెళ్లేందుకు రెడ్డిగూడెం వరకు గల రోడ్డు మార్గం సుగమం చేశారు. గత టీడీపీ హయాంలో తొలగించిన నకరికల్లు, సత్తెనపల్లి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. నకరికల్లు, ఇనిమెట్ల గ్రామాల మధ్య వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన రోడ్డుపై వరినాట్ల సీజన్‌లలో దమ్ముచక్రాల ట్రాక్టర్‌లు తిరగడంతో రోడ్డు కోతకు గురై గోతులు ఏర్పడ్డాయి. కనీసం ఆ గోతులను పూడ్చే ప్రయత్నం కూడా చేయలేదు.

రీ సర్వే ప్రక్రియపై సమీక్షా సమావేశం

నార్నెపాడు(ముప్పాళ్ల): మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియపై తహసీల్దార్ ఎం.భవానిశంకర్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్వే ప్రక్రియలో భాగంగా అనుసరిస్తున్న విధానాలపై ఆరా తీశారు. సర్వే జరిగే ప్రాంతంలోని రైతులకు ముందస్తు సమాచారం అందివ్వాలని సిబ్బందికి సూచించారు. భూములకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను భూ యజమాని వద్ద నుంచి సేకరించాలన్నారు. సర్వే జరిపే సమయంలో ఏమైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ టి.సుధాకర్, వీఆర్వో హరిప్రసాదు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందరికీ అందించాలి



లంకెలకూరపాడు(ముప్పాళ్ల): కార్డు దారులందరికీ నిత్యావసర సరుకులు అందివ్వాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో నార్నెపాడు, లంకెలకూరపాడు గ్రామాల ఎండీయూ వెహికల్స్‌ను సోమవారం తనిఖీ చేశారు. వాహనం సమయానికి వస్తుందా లేదా అని కార్డు దారుల నుంచి వివరాలు సేకరించారు. ఏ గ్రామానికి ఎన్ని రోజులు పంపిణీ చేస్తున్నారో రికార్డులు పరిశీలించారు. ప్రతి నెలా 18వ తేదీ వరకు సరుకులు అందించాలని సూచించారు. పంపిణీపై ఏమైనా లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

క్లుప్తంగా

వృక్షాంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠా వార్షిక పూజలు



నకరికల్లు: స్థానిక ఎన్నెస్పీ కాలనీలో స్వయంభువుగా వెలసిన వృక్షాంజనేయ స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ తృతీయ వార్షిక వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల విద్యుద్దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు తుంగతుర్తి విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి పూజాధికాలు ప్రారంభయమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భజన బృందం ఆధ్వర్యంలో స్వామి వారి కీర్తనలు ఆలపించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల సహకారంతో ఆలయం వద్ద చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

క్రోసూరు తహసీల్దార్‌గా వెంకట నాగరాజు బాధ్యతల స్వీకారం



క్రోసూరు: క్రోసూరు తహసీల్దార్‌గా వేముల వెంకట నాగరాజు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. శ్యావల్యాపురం మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై క్రోసూరు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ అర్జీలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, వీఆర్వోలు ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చివరి ఎకరా వరకు సాగునీరు అందిస్తాం

డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు



పెదకూరపాడు: నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలో ఉన్న అమరావతి మేజర్‌పై పూడిక, నాచు పేరుకు పోవడంతో సాగునీరు ముందుకు పారడం లేదు. సాగక మేజర్ పరిధిలోని పెదకూరపాడు, లగడపాడు, బుచ్చయ్యపాలెం, జలాలపురం, అబ్బరాజుపాలెం, రామాపురం గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజుల నుంచి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాలతో ప్రత్యేకంగా నాలుగు ప్రొక్లయినర్లు ఏర్పాటు చేసి మేజర్‌లో పూడిక, నాచు తీత పనులు, కాలువ కట్టలు బలోపేతం చేస్తున్నట్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు తెలిపారు. రెండు మూడు రోజుల్లో మేజర్ పరిధిలోని చివర ఆయకట్టు భూములకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. జరుగుతున్న పనులను స్థానిక నేతలు అర్తిమల్ల రమేష్, మక్కెన సాగరులతో కలిసి పరిశీలించారు.

10వ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ



రాజుపాలెం: 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నందున విద్యార్థులను సంసిద్ధం చేయాలని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, గణపవరం జిల్లా పరిషత్ పాఠశాల, అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలలో ఉత్తీర్ణత సాధించేందుకు సూచనలు, సలహాలను అందించారు. విద్యార్థుల ద్వారా సమాధానాలను రాబట్టారు. తరగతులకు గైరు హాజరు కాకుండా రావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులతో మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులను ప్రత్యేకంగా చదివించాలని సూచించారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంఈవో–1 మల్లిఖార్జునశర్మ, ప్రధానోపాధ్యాయులు జోతిర్మయి, సుగుణమ్మ, పద్మజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాల చుట్టూ ముళ్ల కంచెలు ఉన్నాయని సోమవారం వచ్చిన వార్తకు విద్యాశాఖాధికారి స్పందించారు. వెంటనే చుట్టూ ఉన్న ముళ్ల కంచెలను తొలగించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జోతిర్మయిని ఆదేశించారు. వచ్చిన వార్తకు రాత పూర్వకంగా వివరణ తీసుకున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సమష్టిగా పోరాడదాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త

సత్తెనపల్లి: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమష్టిగా పోరాడుదామని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పిలుపు నిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నవరత్నాల రూపంలో ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి చేరువైందన్నారు. అయినప్పటికీ ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైందని అన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రతి అంశంపై దృష్టి సారించడం జరుగుతుందని, మండలంలోని ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఏడాది కూడా తిరక్కుండానే ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా పాలకులు కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రజలు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఆందోళన చేసే పరిస్థితి నెలకొందన్నారు. సత్తెనపల్లి మండలంలో పూర్తి స్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ బలోపేతమే ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలన్నారు. మండలంలోని పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆయన పరిచయం చేసుకున్నారు. నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, నాయకులు పక్కాల సూరిబాబు, కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, సంకటి శ్యాంసన్, షేక్ ఎలవర్తిపాటి ఇస్సా, బూతుకూరి లక్ష్మారెడ్డి, నల్లబోతు శివనారాయణ, చిలుకా జైపాల్, నందిగామ యల్లమంద మాట్లాడారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గుండెపోటు బాధితులకు సీహెచ్‌సీలో అత్యవసర వైద్యం

పెదకూరపాడు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విద్య



పెదకూరపాడు: గుండెపోటు మన పాలిట పిడుగుపాటు లాంటిది. ఉన్నట్టుండి విరుచుకుపడి ప్రాణాన్ని గాలిలో దీపంలా మార్చేస్తుంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో సకాలంలో సత్వర వైద్యం పొందినప్పుడే ప్రాణాల్ని నిలబెట్టుకోగలమని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.విద్య పేర్కొన్నారు. గుండెపోటుకు గురైన సమయంలో స్థానికంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వైద్యంకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయని సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. గుండెనొప్పి రోగులకు స్వాంతన చేకూరేలా హబ్ అండ్ స్పోక్ విధానంలో రూ.40 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్‌ను అవసరమైన రోగులకు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. గుండెనొప్పి వచ్చినప్పుడు ఆసుపత్రికి వస్తే వైద్యులు ఈసీజీ తీసి రోగుల సమస్యను పెద్ద ఆస్పత్రికి (హబ్) పంపుతారన్నారు. వాటిని పరిశీలించి ఉన్నత వైద్య నిపుణులు.. ఆయా రోగులకు ఇంజక్షన్ అవసరమో కాదో చెబుతారని దాన్ని బట్టి అవసరమైన వారికి వెంటనే స్థానిక ఆసుపత్రి వైద్యులే ఇంజక్షన్ ఇస్తారన్నారు. ఇప్పటివరకు వంద మందికి పైగా రోగులను పరీక్షించగా.. 50 మందికి గుండె సమస్యలు ఉన్నట్లు గుర్తించామని అందులో నలుగురికి ఇంజక్షన్ ఇచ్చామన్నారు. అత్యవసర చికిత్సతో రోగులు ప్రయోజనం పొందుతారని, మిగిలిన వారికీ సరైన వైద్యం అందుతుందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు: మండలంలోని ఉయ్యందన గ్రామానికి చెందిన ఎస్.శివశంకర్ (38) అనే వ్యక్తి సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు. మూడు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా జాతీయ మహిళ వైద్యుల దినోత్సవం



ఎలిజబెత్‌బ్లాక్‌వెల్ చిత్రపటానికి నివాళులర్పించిన వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది

క్రోసూరు: జాతీయ మహిళ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని సోమవారం క్రోసూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తొలి మహిళా వైద్యురాలు స్వర్గీయ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ చిత్రపటానికి వైద్యులు డాక్టర్ ధనుష్, డాక్టర్ సిరిచందన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ వైద్య రంగంలో తొలిగా మెడికల్ డిగ్రీ పొందిన మహిళ ఎలిజబెత్ బ్లాక్ వెల్ అని కొనియాడారు. ఆమె జయంతి పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, స్టాఫ్ నర్స్ అంజమ్మ, ఫార్మసిస్ట్ సయ్యద్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ ప్రేమ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నిరుపేదలు

పెదకూరపాడు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు మూడు సెంట్ల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని పల్నాడు జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి భైరవపట్నం రామకృష్ణ, జిల్లా సీపీఐ కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ, సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పెదకూరపాడులో నిరసన ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ ధనలక్ష్మిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చటంలో వెనకబడిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ నాగుల్ మీరా, బసవయ్య, గోపి, ధనలక్ష్మి, స్వాతి, పటాన్ హసీనా, వీరాచార్యులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పట్టపగలు చోరీ

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు, పెరికపాడు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం దొంగతనాలు చోటు చేసుకున్నాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని దొడ్లేరు గ్రామానికి భీమ్‌రెడ్డి చిన్న అంజిరెడ్డి వ్యాపార పనులపై క్రోసూరు వెళ్లగా, భార్య మిర్చి కోతలకు వెళ్లింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలుగొట్టి దొంగతనానికి పాల్పడ్డట్టు తెలిపారు. 15 శౌరీల బంగారం, రూ.20 వేల నగదు పోయినట్లు బాధితుడు తెలిపారు. అదే విధంగా పెరికపాడు గ్రామంలోని బాణావత్ రామకోటి నాయక్ ఇంట్లో కూడా ఎవరూ లేని సమయంలో దొంగలు పడి రూ.2 లక్షల నగదు, పది శౌరీల బంగారం దొంగిలించినట్లు తెలిపాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దొంగతనం జరిగిన ఇళ్లకు వెళ్లి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సుప్రసిద్ధ హార్మోనిస్టు, లయ బ్రహ్మ స్వర్గీయ ఖుదావన్

రేపు ఖుదావన్ జయంతిని పురస్కరించుకుని



క్రోసూరు జెడ్పీ పాఠశాల ఆవరణలో ఖుదావన్ కళావేదిక

క్రోసూరు: పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరం గ్రామంలో 1934 ఫిబ్రవరి 5న పేద రైతు కుటుంబంలో జన్మించి నాదస్వర కళాకారునిగా కళాజీవితాన్ని ఆరంభించి స్వయంకృషితో కఠోర సాధన చేసి, అకుంఠిత దీక్షతో సుప్రసిద్ధ హార్మోనిస్టుగా అవిశ్రాంత శ్రామికునిగా 40 సంవత్సరాల పాటు పీసపాటి, బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, షణ్ముఖ, ఎ.వి.సుబ్బారావు వంటి కళా కోవిదులకు హార్మోనియం సహకారం అందించి ప్రేక్షకులను రస తరంగిణిలో ముంచెత్తి పరవశింపజేసిన కళాతపస్వి స్వర్గీయ ఖుదావన్. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా శిష్య ప్రశిష్యులను, అభిమానులను ఏర్పరుచుకున్న ధన్యజీవి.. ఫిబ్రవరి 4వ తేదీ 2001వ సంవత్సరంలో కళాబంధు (బొబ్బెల్లపాడు సర్పంచ్) బొబ్బిళ్ళపాటి గోపాలకృష్ణసాయి సారథ్యంలో అంగరంగ వైభవంగా సువర్ణ హస్తఘంటా కంకణంతో సన్మానించి క్రోసూరు ప్రాంత ప్రజలు ఆయన పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. 2001 ఏప్రిల్ 28న ఆయన కాలం చేశారు. క్రోసూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఆయన స్మృతి చిహ్నంగా అభిమానులు, దాతల సహకారంతో రిటైర్డ్ హిందీ పండిట్ కీర్తిశేషులు బోడెపూడి లక్ష్మయ్య లయ బ్రహ్మ షేక్ ఖుదావన్ పేరుతో కళావేదిక నిర్మించారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన ముద్దాయి అరెస్ట్



ఎస్ఐ నాగేంద్రరావు

క్రోసూరు: గత శుక్రవారం రాత్రి క్రోసూరు శివారులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన ముద్దాయి వాసం నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేంద్రరావు సోమవారం తెలిపారు. ఆలయంలో విగ్రహాలు ధ్వంసం ఘటన చోటు చేసుకున్న 24 గంటల్లోనే ముద్దాయిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. ముద్దాయి నాగరాజు గంజాయి, మద్యం వ్యసనాలున్న వ్యక్తి అని, శుక్రవారం రాత్రి జరిగిన ఘటనలో పోలీసులకు దొరికిన ఆధారాలు, తమకు అందిన ఇతర సమాచారం ద్వారా నాగరాజును శనివారం అదుపులోకి తీసుకున్నామని, ముద్దాయి ఆ రోజు రాత్రి గంజాయి సేవించి ఆలయంలో బండపై ఎక్కి కాలితో తన్నటంతో నామాల రాయి పడిపోయిందని, మత్తులో ఉండి విగ్రహాలు విసిరివేసాడని, అక్కడే కూర్చుని మంట పెట్టాడని తెలిపారు. గుడిలో ముద్దాయి చేసిన దుర్మార్గం తెలుకున్న అతని తల్లి వెంకటరావమ్మ అతని దుస్తులు ఉతికివేయటం జరిగిందని, అయినప్పటికీ దుస్తులపై స్వామి వారి దీపాలకు వినియోగించే ఆయిల్ మరకలు పోకపోవటం తాము స్పష్టంగా గుర్తించామన్నారు. ఈ విషయం ముద్దాయి తల్లిదండ్రులకు కూడా తెలుసునని అయినప్పటికీ కావాలని ఆదివారం రాత్రి రోడ్డుపై రాస్తారోకో చేసారన్నారు.

అసలే ఆక్రమణలు.. ఆపై రోడ్డుపైనే పార్కింగ్




స్థానిక అమరావతి రోడ్డులో స్టేటు బ్యాంకు వద్ద రోడ్డు పైనే ఇరువైపుల పార్కింగ్ చేసిన బైకులు

అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేట, అమరావతిరోడ్డులోని స్టేట్‌బ్యాంక్ ఇండియా బ్రాంచి ముందు రోడ్డుపైనే వందల సంఖ్యలో బైకులు పార్కింగ్ చేస్తున్నారు. అసలే ఆ రోడ్డు చాలా భాగం ఆక్రమణలకు గురైంది. ఎదురు వాహనం వస్తే పక్కకు తప్పుకునే వీలు కూడా ఉండదు. దానికి తోడు రోడ్డుకు రెండు వైపులా బైకులు పార్కింగు చేస్తున్నారు. ఖాతాదారులకు పార్కింగ్ స్థలం చూపించాల్సిన బ్యాంకు సిబ్బంది అది పని కాదనట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణలను తొలగించాల్సిన పంచాయతీ, రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లు ఉంటున్నారు. ట్రాఫిక్ కంట్రోల్ చేయాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్రవహిస్తున్నారు. పలు గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చే ప్రజానీకం నడవడానికి కూడా ఇబ్బంది కరంగా మారింది. మరి దీనికి పరిష్కారమేంటో.. ఎన్ని ఏళ్ల గడచినా, అధికారులు ఎందరు మారినా సమస్యకు పరిష్కారం లేదా.. ఎలాగైనా సమస్యలను పరిష్కరించాల్సిన అవసం, ఆవశ్యకత పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులపైనే ఉందన్న విషయాన్ని గుర్తించాలి.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక అక్షర్యాసంలో చిన్నారులు, తల్లిదండ్రులు



సరస్వతీ శిశుమందిర్‌లో హోమంలో భక్తులు

సత్తెనపల్లి: పట్టణంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, ప్రసిద్ధ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ పులుపుల ఫణికుమార శర్మ హాజరై మాట్లాడారు. చదువులతల్లి, సకలవిద్యా స్వరూపిణి సరస్వతీమాత కృప చిన్నారులందరి మీద పరిపూర్ణంగా ఉండాలని ప్రార్థిస్తూ, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సరస్వతీ దేవి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్జీ, విజయవాడ సమితి కోశాధికారి నాగేశ్వరరావు, స్థానిక శిశుమందిర్ అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, కార్యదర్శి చలువాది చిన సత్యనారాయణ, కోశాధికారి గోపీకృష్ణ, శ్రీరామమూర్తి, పెరుమాళ్ళ శివన్నారాయణ, హరికుమార్, రాంబాబు, బదరీ నారాయణ, రత్తయ్య, దేవరశెట్టి రవి కుమార్, పాఠశాల ప్రధానాచార్యులు మన్నవ ధనలక్ష్మి, సరస్వతీ శిశు మందిర్ ఆచార్య బృందం పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని ఆలయ ధర్మకర్తలు, మహాలక్ష్మి లలిత భక్త సమాజం సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో సరస్వతి దేవి – మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, విశేష అష్టోత్తరపూజలు నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతి అమ్మవారి ఉత్సవ మూర్తికి స్నపన తిరుమంజనం, విశేష పూజలను ఆలయ అర్చక స్వామి శ్రీమాన్ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజస్వామి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహా ప్రదర్శన జయప్రదం చేయాలి



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల7వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన లక్షల డప్పుల వెయ్యి గొంతుల మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి అశోక్ కోరారు. సోమవారం మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో మహా ప్రదర్శనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి ఇంటి నుంచి డప్పులతో బయలుదేరి హైదరాబాద్‌కు రావాలన్నారు. మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పీ దాసు, పీ వేణు, గోపి, మణికంఠ, కే దేవసహాయం, నాగేశ్వరరావు, కార్తీక్, పెద్దలాజర్, ముత్తయ్య, పీ రాజేష్, చిలకా నిర్మల తదితరులు పాల్గొన్నారు.